# ఒక్కమాట

రాసబెహారి ఎవెన్యూలో పెద్ద చటర్జీగారిల్లు పట్టుకోవడం నాకంత కష్టం కాలేదుగాని ఆయన గారి కూతుర్ని పట్టుకోవటానికి మాత్రం రెండు రోజులు పట్టింది- అదీ నాకు ఇంటర్వ్యూ అయిపోయిం తరువాత గానీ కుదరలేదు.

ముసలాయన బయటకు రాలేదు. వద్దామని కోటూ బూటూ వేసుకు తయారయినా, ఏ నడుం నొప్పో, కాలు నొప్పో వచ్చి కుర్చీలో కూలబడి పోయేవాడు. ఆ పైన జేబులోనుంచి హోమియో మాత్రల సీసా తీసి మాత్రలు వేసుకోవడం...

హైదరాబాద్‌లో వాళ్ళబ్బాయి చటర్జీ 'నువ్వు మా ఇంటికి వెళ్ళు- లంకంత కొంప- మా చెల్లెలు సిసింద్రీ- నిన్ను ఇంటర్వ్యూ జరిగే చోటుకు, ఆ పైన కలకత్తా చూపించటానికి ఎగురుకుంటూ వెంట వస్తుంది!' అంటూ మరీ చెప్పి పంపించాడు. వాళ్ళకు ఫోన్ చేసి చెప్పాడు నా రాక విషయం.

అతగాడి సిసింద్రీ చెల్లెల్ని నేను అంతకు ముందు హైద్రాబాద్‌లోనే వాళ్ళింట్లో చాలా సార్లు చూశాను. ఇప్పుడు పని చేస్తున్న కంపెనీలో నేను మూడేళ్ళ క్రితం జేరినప్పుడు- నా కేడర్‌లోనే వున్న అతడింటికి తరచు వెళుతుండేవాడిని. అప్పుడు అతడి తల్లీ, తండ్రీ, చెల్లెలు గూడా అక్కడే వుండేవారు. వాళ్ళు రెండేళ్ళు హైద్రాబాద్‌లోనే వుండటంతో తెలుగు కొద్దికొద్దిగా మాట్లాడగలుగుతారు. అతడి చెల్లెలయితే అనర్గళంగా మాట్లాడేస్తుంది!

ఆ సిసింద్రీ పేరు శ్యామూ! చక్కగా అలంకరించుకోకుండా తన గదిలోనుంచి బైటకు వచ్చేది కాదు!

నేను కలకత్తా వచ్చిన మూడో రోజు సాయంత్రం ఆరు గంటలప్పుడు టాక్సీ దిగి లోపలకు పరుగెత్తుకుంటూ వస్తూనే, హాల్లో వున్న నాతో, "సారీ మూర్తిగారూ! నా థిక్కెస్టు ఫ్రెండు తపస్విని వివాహమయితే హౌరాలో వుండిపోవాల్సి వచ్చింది మొన్నటినుంచి...

ఏంవీ అనుకోవద్దు! ఇంతకీ మీరు ఇంటర్వ్యూలో సెలక్ట్ అయినట్లే గదా!" అంటూ చనువుగా వచ్చి సోఫాలో నా పక్కగా కూర్చున్నది.

ఆమె చొరవకు గాభరాపడుతూ కొద్దిగా పక్కకు జరిగాను, ఎదురుగా వున్న ముసలివాళ్ళ ముందు ఆ అమ్మాయి మరీ నాకు అంత దగ్గరగా కూర్చోవడం ఇబ్బందికరంగా వుండటంతో.

"బాగానే చేశాను గనుక సెలక్ట్ అవ్వవచ్చు!"

"అవ్వచ్చేమిటి... అయ్యారు! అభినందనలు స్వీకరించండి!" అన్నది నా చేయి పట్టుకు ఊపేస్తూ.

"అదేంవిటి... ఆ విషయం మీకెలా తెలుసు?" ఆశ్చర్యపోవడం నా వంతయింది.

"మొదటిది ఆ కంపెనీ డైరెక్టర్ మా తపస్వినికి బాబాయి... రెండు ఆ కంపెనీ సెక్రటరీ మా అన్నయ్యకు తెలిసిన వాడవ్వడంతో హైదరాబాద్‌నుంచి ఫోన్ చేసి చెప్పాడు!" అన్నదామె.

"ఇవేవీ నాకు కనీసం మాటమాత్రం గూడా చెప్పలేదు!" విభ్రాంతిగా అన్నాను.

శ్యామూ పకపకా నవ్వింది, అందమైన ఆమె పంటి చిగుళ్ళు బయటకు కనబడేలా.

నేను ఆమె అందాన్ని కళ్ళల్లో నింపుకుంటూ ఆమె తీయని మాటలు వింటున్నాను.

"ఇదంతా మేం చేస్తున్నాం అని తెలిస్తే మీరు సబ్జక్టులో బాగా ప్రిపేర్ కారేమోనని నేనే చెప్పొద్దన్నాను... ఎంత తెలిసిన డైరెక్టర్ అయినా ప్రైవేటు సెక్టార్‌లో వాళ్ళకు పనికిరాని వాడిని జేర్చుకొని నష్టపోరు కదా!"

ఆ అమ్మాయి రీజనింగ్ నాకు నచ్చింది. మెచ్చుకోలుగా శ్యామూ ముఖంలోకి చూచాను.

"ఈ క్షణం నుంచీ నేను మీ ఆధీనంలో వుంటాను... ఎక్కడికి వెళ్దామంటారో చెప్పండి... మీరు శనివారం ఉదయానికి గదా ఫలక్‌నామాకు టిక్కెట్టు తీసుకున్నది... రెండు పూర్తి రోజులు మన చేతిలో వున్నాయి... కలకత్తా మొత్తాన్ని మీ కళ్ళముందు ఉంచేటందుకు ఆ సమయం చాలు!"

నేను చిన్నగా నవ్వాను. "మీరు ప్లాన్ చేయండి... సాధ్యమయినంతవరకూ నన్ను పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లోనే తీసుకు వెళ్ళండి. టాక్సీలో వెళితే చూద్దామనుకున్న నాలుగు ప్రదేశాలే చూస్తాను ... బస్సుల్లోనూ, ట్రాముల్లోనూ తిరిగితే కలకత్తా మొత్తం చూస్తాను!"

"ఫైన్!" అంటూ ఆ అమ్మాయి లోపలకు వెళ్ళింది.

పెద్ద చటర్జీగారు నా వంక చూస్తూ, "ఇక మీకు కావాల్సినంత కాలక్షేపం. మా శ్యామూ నోరు ఒక్క క్షణమైనా మూతపడదు!" అన్నారు.

మరునాడు ఉదయం ఎనిమిది గంటలకల్లా మేం ఇద్దరం ఇంటి నుండి బయటపడ్డాం.

భుజాన వ్యానిటీ, చేతిలో గొడుగుతో బయటకు వస్తూ, "ఒక్కమాట!" అన్నది శ్యామూ.

"అదే నేనూ చెప్పబోతున్నాను! ఎప్పుడూ, ఎక్కడా మీరు పర్సు బయటకు తీయబోకండి!"

"అదేం?" అన్నది శ్యామూ.

"మిమ్మల్ని ఊరంతా తిప్పుతూ శ్రమపెట్టటమే గాకుండా మీచేత డబ్బులుకూడా ఖర్చు పెట్టించడం నాకు భావ్యం కాదు గనుక!" అన్నాను.

"అయితే మీకు గైడ్ అయి చివరకు ఫీజు వసూలు చేస్తాను లేండి!" అంది శ్యామూ.

"వెల్కం!" అన్నాను.

"కాళీఘాట్‌లో ట్రాం ఎక్కి, ఎస్‌ప్లనేడ్‌లో దిగుదాం. అక్కడనుంచి టాక్సీలో దక్షిణేశ్వర్ వెళ్ళి ఆపైన బోటులో బేలూరు వెళితే సరిపోతుంది... పదండి... పదండి!" అన్నది గొడుగు విడదీస్తూ.

"కాస్త ఎండను కూడా మీ బెంగాలీ ఆడవాళ్ళు భరించలేరల్లే వున్నది. ప్రతివాళ్ళ చేతిలో గొడుగు!"

"మా అందం మాసిపోవడం మాకిష్టం లేదు!" అన్నది లిప్‌స్టిక్ పూసిన పెదాలను వెడల్పు చేస్తూ.

శ్యామూ అందంగా వుంటుంది. తెల్లగా వుంటుంది. ఏ మాత్రం ఎండకయినా కందినట్లే కనబడుతుంది. ఆమె అన్నదాంట్లో అబద్ధం లేదు. బెంగాలీ ఆడవాళ్ళు చూడముచ్చటగా వుంటారు. శ్యామూ ముఖంలోకి తన్మయంగా చూశాను. సూదంటు రాయి ముందు నేను ఇనుప ముక్కనే ఆయ్యాను!

కాళీఘాట్ స్టేజిలో మేం కాలు పెడుతుండగానే ఎక్కవలసిన ట్రాం వచ్చింది.

"ఫస్ట్‌క్లాస్‌లో ఎక్కుదామా... సెకండ్ క్లాసా?"

నేను ఆశ్చర్యంగా శ్యామూ వంక చూచాను. ఆ ట్రాంకు వున్నవి మూడు పెట్టెలు. అందునా మాసిపోయి డొక్కుగా వున్నాయి. దాంట్లో ఫస్ట్‌క్లాస్ గూడానా?

అదే అంటే, "రెండూ ఒకటేగాని- ఫస్ట్‌క్లాస్‌లో ఫ్యానుంటుంది. పావలా ఎక్కువ!" అన్నది నవ్వుతూ.

"సరే సరే! ఫస్ట్‌క్లాస్‌లోనే ఎక్కుదాం పదండి!"

దక్షిణేశ్వర్ వెళ్ళటానికి మాకు గంట పైనే పట్టింది. ఆ రోజు వర్కింగ్‌డే అవ్వడంతో క్యూలు పెద్దవి లేవు. "అమ్మవారిని ఎదురునుంచి చూస్తారా... పక్కనుంచి చూస్తారా?" అడిగింది.

"రెండువైపులా చూద్దాం!" అన్నాను.

ఎర్రటి మందారాలను మెడనిండా వేసుకొని, నాలికను చాచి, జుట్టును ముందుకేసుకొని, నల్లగా వున్న కాళికా దేవిని భయంతోనూ, భక్తితోనూ కొన్ని నిముషాలు చూస్తూ వుండిపోయాను.

ఎత్తు మీదగా వున్న గుడి. ఎదురుగ్గా మండపం. చుట్టూ ఖాళీ స్థలం. ఓ పక్కగా పన్నెండు శివలింగాలు. శ్యామూ గంగనుండి సీసాతో నీళ్ళు తెచ్చి పన్నెండు లింగాల మీదా పోస్తూ ధ్యానించింది.

కళ్ళు మూసుకొని గంగను ధారగా లింగం మీద పోస్తున్న ఆమెను చూస్తుంటే నాలోనూ భక్తి భావన తొణికిస లాడింది. ఇద్దరం రామకృష్ణ పరమహంస నివసించిన గదిలోకి వెళ్ళాం. మంచం మీద పరుపులమీద ఆయన ఫొటో పెట్టివున్నది.

ఆ గదిలో చాలా నిశ్శబ్దంగా వున్నది. ద్వారం నుండి లోపల కాలు పెడుతుండగానే తీర్థమిచ్చారు. చేయిపట్టి, కళ్ళకద్దుకొని నోట్లో పోసుకున్నాను.

"రెండు నిముషాలు!" అంటూనే శ్యామూ ఆ గదిలో ఓ పక్కకు వెళ్ళి పద్మాసనం వేసుకుని కూర్చొని కళ్ళు మూసుకున్నది. ఇంకా చాలా మంది యువతీ యువకులు కూర్చున్నారు అక్కడ.

రెండు నిముషాలు, మూడు నిముషాలు... ఐదు నిముషాలు... ఏ దేవతో శ్యామూ రూపంలో వచ్చి బంగారు బొమ్మలా మారి అక్కడుండిపోయిందా- అన్నట్లుగా తాదాత్మ్యంతో చూస్తూ వుండిపోయాను, కాలగమనాన్ని గూడా గమనించకుండా ఆమెనే.

పావు గంట తర్వాత ఆ బొమ్మకు ఎవరో ప్రాణం పోసినట్లుగా కళ్ళు తెరిచింది. నేను ఉలిక్కిపడి కళ్ళు రెపరెప లాడిస్తూ, శరీరాన్ని ఏదో మెరుపు చుట్టేస్తున్నట్లుగా ఊగిపోయాను.

ఆమె లేచింది. "సారీ! నేను ఇక్కడకు వస్తే సర్వం మరిచిపోతాను!" అన్నది.

"కానీ, నేను మీ తన్మయత్వాన్ని ఆనందించాను!" ఆరాధనగా ఆమెనే చూస్తూ అన్నాను.

ఆ రోజు ఆమె తన పొడువైన ఒత్తయిన జుట్టును చుట్టగా చుట్టుకొని వయస్సుకు మించిన పెద్ద దానిలా కనబడుతున్నది.

"ఒక్క మాట మీకు చెప్పాలి!" అన్నది పాలరాతి మెట్లు దిగుతూ తలెత్తి నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"మీ మాటలు వినడం నాకు ఆనందమేగాని... పదండి... పదండి... అక్కడ ఏవో చాలా రకాల వస్తువులు అమ్ముతున్నారు... చూద్దాం!" అన్నాను.

ఇద్దరం చెట్ల క్రిందగా వున్న దుకాణాల దగ్గరకు వచ్చాం. అక్కడన్నీ ఎక్కువగా చిన్నపిల్లలకు పనికి వచ్చే బొమ్మలే. రాతితో చేసినవి... ప్లాస్టిక్‌తో చేసినవి. ఆ పైన కాళికాదేవి ఫొటోలు...

శ్యామూకు ఈ రెండు రోజుల్లో ఏదైనా మంచి బహుమతి ఒకటి కొనాలి.

"పదండి... బోటు రెడీగా వున్నది... బేలూరుమఠ్‌కు వెళ్దాం!" అంటూ ముందుకు అడుగులు వేయసాగింది. నేను అనుసరించాను.

హుగ్లీ నదిలో బోటు ఎక్కాం. మెట్ల పక్కగా అంతా మురికి నీరు. పడవ బయల్దేరింది. నీరు ఎదురు పారుతున్నట్లే వున్నది. పడవ ఊగిపోసాగింది. పిల్లలు, పెద్దలు పెద్దగా కేకలేయడం మొదలుపెట్టారు. నేను అటూ ఇటూ చూస్తున్నాను కాస్త ఇబ్బందిగా- ఇదే ప్రథమం బోటు ఎక్కడం అవ్వడంతో.

"భయపడబోకండి!" అన్నది నా చేయి పట్టుకుంటూ శ్యామూ. ఆమె గట్టిగా పట్టుకున్న తీరుకు నా శరీరం ఉద్విగ్నతతో ఒక్కసారి చలించింది. "కాస్త ముందుకు వెళితే సాఫీగా వుంటుంది పడవ నడక!"

నా భయానికి ఆమె కళ్ళు నవ్వుతున్నట్లే వున్నాయి. నా శరీరంలోకి ఆమెనుండి విద్యుత్‌తరంగాలు ప్రవహిస్తుండగా తమకంగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయాను. ఎంత అందమైనదీ శ్యామూ!

"మీకు ఒక్కమాట చెప్పాలి!" మరోసారి అన్నది నా మనస్సును పడవ మీదకు లాగుతూ, నా వంకే, రెప్పలార్పకుండా తదేకంగా చూస్తూ.

ఇటు దక్షిణేశ్వర్... అటు బేలూరు... ఇటు కాళికాలయం... అటు రామకృష్ణా మఠం... మధ్యలో నీలి నీళ్ళ మీద పరుగులెడుతున్న మా పడవ... అందులో నాకు ఒక్క శ్యామూనే కనబడుతున్నది.

"మీరు ఒక్కమాట గాదు ఆగకుండా వంద మాటలు చెప్పినా నా బుర్రకు ఒక్కటీ ఎక్కదు ఇప్పుడు... ఈ దృశ్యం ఎంత మనోహరంగా వున్నది... మీ బెంగాలీల అదృష్టమా- రామకృష్ణుడూ, వివేకానందుడూ మీ వాళ్ళవటం!"

"టైం లేదు... వుంటే శాంతినికేతన్‌క్కూడా తీసుకెళ్ళేదాన్ని! అక్కడ వాతావరణం... ఆ పూలవనాలు... ఆ ప్రశాంతత... రబీంద్రనాధ్ ఠాగూర్ గీసిన అద్భుతమైన బొమ్మలు... మిమ్మల్ని అక్కడనుంచి తిరిగి రానిచ్చేవి కాదు త్వరగా!"

ఆమె శాంతినికేతన్‌లో ఓ సంవత్సరంపాటు వుండి సంగీతం నేర్చుకున్నదని నాకు తెలుసు!

"ఇంకో నాలుగు రోజులు వుండేదా?"

"అదేం!... ఉద్యోగంలో చేరరా?" ఆ మాటకు ఉలిక్కిపడ్డట్లుగా ఆమె వంక చూశాను.

ఆమెను చూస్తూ, ఆమెతో కాలక్షేపం చేస్తూ అసలు నేను కలకత్తా ఎందుకొచ్చానో కూడా మరిచిపోయానన్న మాట! మైగాడ్... ఆమె చేతి మీద చేయి వేసి, "భయం తీరింది... ఇక నన్ను వదులుతారా!" అన్నాను కళ్ళు చికిలించి ఆ అమ్మాయిని కవ్విస్తున్నట్లుగా చూస్తూ. శ్యామూ తన చేతిని నా చేతిమీదనుంచి చటుక్కున తీసింది. ఆమె ముఖం సిగ్గుతో మందారమైంది. ఆ క్షణాన తలవంచి, కళ్ళు వాల్చి నన్ను అప్పటి వరకూ పట్టుకున్న ఆమె అరచేతి వంకే చూసుకోసాగింది. నేను నవ్వాను ఆమె చేష్టకు.

ఒడ్డున పడవ ఆగితే ఇద్దరం దిగాం. సన్నని సందుగుండా రామకృష్ణా మిషన్ ఆవరణ వైపుకు నడుస్తున్నా. నాకు కలకత్తా రోడ్లను చూస్తే చాలా చికాగ్గా వున్నది. రోడ్డు పక్కనే చెత్త కుప్పలు. మనుష్యులు ఎంత అందంగానూ, శుభ్రంగానూ వుంటేనేం పరిసరాలు అపరిశుభ్రంగా వున్నప్పుడు. ఇళ్ళు కూడా అంతే- బయటకు పాతవిగా- రంగు వెలసిపోయి, నల్లటి కప్పేసి... బహుశా లోపలి వరకే వాళ్ళు వాటిని శుభ్రంగా వుంచుకుంటూ వుండవచ్చు.

గేటుదాటి లోపలకు వెళ్ళాం. సెక్యూరిటీ బాగా పటిష్టంగా వున్నది. మెటల్ డిటెక్టర్‌తో చెక్ చేసి మరీ లోపలకు పంపుతున్నారు.

"ఇక్కడ నయం... బిర్లామందిర్‌లోకైతే మంచి నీళ్ళ సీసాను కూడా పట్టుకు వెళ్లనీయరు!"

"పరిసరాలు పాడు చేస్తారనా?"

"కాదు... టెర్రరిస్టుల బెడదతో జాగ్రత్తలు!"

మెట్లెక్కి పెద్దహాల్లో కాలుపెట్టాం. రామకృష్ణ పరమహంస పాలరాతి విగ్రహం. అర్ధనిమీలిత నేత్రాలతో కూర్చొని వున్న ఆయన విగ్రహం వంకే చూస్తుండి పోయాను కొన్ని నిముషాల వరకూ సర్వం మరిచి. భగవంతునితో స్వయంగా మాట్లాడిన మనిషి భగవంతుడే అవుతాడు నిస్సందేహంగా!

పావు గంట తర్వాత బయటకు వచ్చాం. పక్కనే వున్న మొదటి అంతస్తులోని వివేకానందుడి గదిలోకి వెళ్ళాం. అతి ప్రశాంతంగావున్న ఆ గదిలో చల్లటి గాలి వీస్తున్న తీరు ఆయన మాటలే తరంగాల్లా మీదగా పారాడుతున్నాయా అనిపిస్తోంది.

బయటకు వచ్చి శారదాదేవి మందిరాన్ని చూచి ఒక్క చెట్టు క్రింద కూర్చుంటుండగా, "ఒక్క మాట చెప్పాలని నా తాపత్రయం... మీరు ప్రతిసారీ దానికి అడ్డుపడుతూనే వున్నారు" అన్నది చిన్నగా నేనేమైనా మరల అడ్డం వస్తానేమోనన్నంత ఆత్రంగా.

"ఇక నేను మాట్లాడను... చెప్పండి!" అన్నాను నోటి మీద వేలేసుకుంటూ.

"మీరిక్కడ ఉద్యోగంలో జేరాలని మా అన్నయ్య ఎందుకు కోరుకుంటున్నాడో మీకు తెలుసా?" చాలా వడివడిగా అన్నది శ్యామూ.

"అక్కడ చేస్తున్న ఉద్యోగం కంటే ఇది పెద్ద ఉద్యోగం కాబట్టి... మిత్రుడిగా సాయం చేద్దామని అనుకొని వుంటాడు!" ఆమె అడిగింది చాలా సాధారణ విషయం అనిపించగా చాలా తేలిగ్గా ఆ విషయాన్ని తీసుకున్నాను. "ప్లానిటోరియంకు ఇవ్వాళ వెళితే సరిపోతుంది గదా!"

"మా అన్నయ్య స్వార్థపరుడు!" ఆమె శారదాదేవి మందిరం వైపుకే చూస్తోంది.

"ఓ మనిషి మరో మనిషికి సాయం చేయడం స్వార్థమెలా అవుతుంది!" ఆమె వంకే చూస్తూ అన్నాను. "ఆయన నాకు చాలా మంచి మిత్రుడు!"

"కంపెనీ ఇంటర్వ్యూతో పాటు మీరు నన్నుకూడా ఇంటర్వ్యూ చేయాలని ఆయన ఉద్దేశ్యం!" తల వంచుకున్నది కళ్ళను నా వైపుకు ఓరగా తిప్పి చూస్తూ.

నాకు చటుక్కున ఓ అనుమానం వచ్చింది. సంవత్సరంక్రితం తల్లినీ, చెల్లెల్నీ కలకత్తాకు పంపించి వేస్తూ, "వాళ్ళు ఇక్కడ ఉండటానికి ఓ ప్రాబ్లం వచ్చింది మూర్తీ! శ్యామూకు పెళ్ళి చేయాలి. మంచి సంబంధం దొరకాలీ అంటే కలకత్తాలోనే వీలవుతుంది... ఇక్కడ బెంగాలీలు ఎంతమంది వున్నా, అక్కడ దొరికినంత తేలిగ్గా సంబంధం దొరకటం కష్టం! అక్కడ మా తాలూకు బంధువులు చాలా మంది వున్నారు" చటర్జీ అన్నమాటలు ఆ సమయంలో గుర్తుకు వచ్చినయి.

నేను ఇప్పుడు శ్యామూను ఇంటర్వ్యూ చేయడం అంటే- ఆ అమ్మాయితో మాట్లాడి పెళ్ళి చేసుకునేటందుకు నా ఇష్టాయిష్టాలను తెలియబరచటమా?

ఆ ఆలోచన రావటమే ఆలస్యం, అందమయిన శ్యామూ నా కళ్ళకు ఓ అద్భుత సౌందర్యరాసిలా కనబడింది. అంత అందమైన అమ్మాయి నా భార్యగా అవ్వడం నా అదృష్టంగా భావిస్తాను.

మా పెద్దలూ నా మాట ఏనాటికీ కాదనరు. నా చెల్లెలు పెళ్ళి ఎప్పుడో అయిపోవడంతో వారికింకా ఎటువంటి బాధ్యతలూ లేవు. నేను ఎక్కడున్నా, ఏం చేసినా ఎలాంటి ఇబ్బందీ లేదు.

మనస్సంతా ప్రఫుల్లమయింది.

"నిజమా?" అన్నాను కళ్ళు పెద్దవి చేసుకు చూస్తూ.

"అవును- అందుకు మీకిష్టమేనేమిటి?"

"కాదూ అనటానికి నాకు కారణం కనబడటం లేదు!" అన్నాను మురిపెంగా చూస్తూ. ఆ క్షణాన ఆమెను దగ్గరకు తీసుకొని ముద్దులతో ముంచెత్తాలనిపిస్తోంది, శ్యామూ చెప్పిన మాట విన్న తరువాత!

"నా యిష్టా యిష్టాల ప్రసక్తి లేదా?"

"మీకు యిష్టం లేదా?" ఆకాశంలో తిరుగుతున్న నన్ను ఎవళ్ళో కాళ్ళు పట్టుకు కిందకు గుంజినట్టుగా ఉలిక్కి పడుతూ ఆమె వంక చూశాను.

"ఉండి తీరాలని రూలున్నదా?" అందామె.

"ఉన్నదా లేదా చెప్పండి... రూలు సంగతెందుకు. నేను మీకు భర్తగా పనికివస్తానా లేదా అనేది నిర్ణయించుకునే స్వేచ్ఛ మీకున్నది. ఏదైనా మనస్ఫూర్తిగా అంగీకారమైతేనే... ఇందులో నా భావాలు, మీ అన్నయ్య కోరికలూ, పెద్దల ఆంక్షలూ ఏవీ మధ్యలో రాగూడదు! మనిద్దరం స్వతంత్రంగా ఆలోచించుకొని మన భవిష్యత్తుకు మంచిదీ అనుకుంటే ఓ నిర్ణయం తీసుకుందాం... అది ఈ క్షణానే అక్కర్లేదు... ఇక్కడే ఉండబోతున్నాను... మీ నిర్ణయాన్ని మీ వీలువెంట చెప్పవచ్చు!" నాలోని ఆవేశాన్ని నిగ్రహించుకుంటూ అన్నాను.

ప్లానిటోరియంలో కూర్చొని ఆకాశంలోని తారలను చూస్తుంటే ఆ చల్లదనంలో నిద్ర ముంచుకొచ్చేస్తోంది. మెడ వాల్చి ఆమె నోటిని నా చెవి దగ్గరకు జేర్చి, "అసలు మేం హైదరాబాద్‌నుండి కలకత్తాకు ఎందుకు వచ్చేశామో మీకు తెలుసా?" అన్నది గొణుగుతున్నట్లుగా తరువాత గంటకు ఆ విషయం మీద మొట్టమొదటిసారిగా.

"మీ అన్నయ్య చెప్పటం- మీకు ఇక్కడ వివాహం చేయడం తేలికని!"

"కాదు... అక్కడే నాకు అసహ్యమేస్తుంది వాడంటే... భార్యను అదుపులో పెట్టుకోలేడు... మేం అక్కడ వుండటం ఆమెకిష్టం లేదు... ముసలివాళ్ళయిన అత్తగారికి, మామగారికి తిండిపెట్టటం దండగనేది ఆమెగారి ఉద్దేశ్యం... ఆమె గీచిన గీటు దాటలేదు మా అన్నయ్య!" అన్నది శ్యామూ.

నాకు చటర్జీ మీద అలాంటి అభిప్రాయం ఏర్పడటానికి ఎప్పుడూ అవకాశమివ్వలేదు. మంచి స్నేహితుడిగానే మెలిగాడు అతడు!

సాయంత్రం ఆరు గంటలైంది. ఇంటికి వెళ్ళినా- శ్యామూ మాటలే నా చెవుల్లో గింగిర్లు తిరుగుతున్నాయి.

శ్యామూ అంతరంగం నాకు అర్థమయింది. ఆమె వదిన చేసిన పనికి, అన్నయ్య భార్యకిచ్చిన అలుసుకు బాధ పడుతోంది. అందుకే తోడబుట్టిన అన్నయ్యను స్వార్థపరుడిగా మనస్సులో చిత్రీకరించుకున్నది.

అన్నం తిని నా గదిలో మంచం మీదకెక్కేటప్పటికి పది గంటలయింది. పడుకున్నా నిద్ర పట్టటం లేదు. శ్యామూ మాటలే గుర్తుకు వస్తున్నాయి. శ్యామూ అన్నయ్య అభిప్రాయం గుర్తుకు వస్తున్నది. శ్యామూ అందం గుర్తుకు వస్తున్నది. శ్యామూ చలాకీతనం గుర్తుకు వస్తున్నది.

శ్యామూ నా భార్య అయితే?

ఆ ఆలోచననే నన్ను ఆనందడోలికల్లో ముంచి వేస్తున్నది. తలుపు చప్పుడయింది. టైం చూచాను. పదకొండు గంటలయింది. ఎవరా అనుకుంటూ వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగ్గా శ్యామా!

ఎర్రటి పెదవులు కదిలిస్తూ, "నిద్రపోతున్నారా?" అన్నది నా ఎదురుగ్గా కుర్చీ లాక్కొని కూర్చుంటూ.

"లేదు. మీ గురించే ఆలోచిస్తున్నాను!"

"మా అన్నయ్య గురించిన ఆలోచనలతో నాకూ నిద్రపట్టడం లేదు!" అన్నది ఆమె.

"మీరు ఇందాక భోజనం చేస్తున్నప్పుడు ఓ పాట ఆలాపించారు. బెంగాలీ నాకు రాదు... దాని అర్థమేమిటో చెప్పండి... అది మీరు పాడుతుంటే ఎంత చక్కగా వున్నది!" అన్నాను.

నా మాటకు ఆమె కళ్ళు తళుక్కున మెరిశాయి. "నాకెంతో ఇష్టమయిన పాట అది!"

ఒక్క క్షణం తన్మయంగా కళ్ళు మూసుకున్నది. "ఈ శరీరం ఎప్పుడూ మనస్సు ఆధీనంలోనే వుండాలి. మనస్సు మమతలతో నిండి వుండాలి. మమతలు కుటుంబాభి వృద్ధికే... ఆ కుటుంబాభివృద్ధి సమాజాభివృద్ధికి తోడ్పడాలి... సమాజాభివృద్ధి సంస్కృతి అనే పునాదిమీద ఆధారపడి వుంటుంది. మన సంస్కృతే మనలను అత్యున్నత స్థానంలో నిలబెట్టగలుగుతుంది!"

"ఇప్పుడు మరోసారి పాడండి... అర్థం తెలిసింది గనుక ఇంకా బాగా ఆనందించగలుగుతాను!"

ఆమె కళ్ళు మూసుకు పాడుతుంటే నేనేదో పుష్పవనంలో, సంధ్యాసమయంలో విహరిస్తున్నప్పుడు- ఏ కోయిలో నా చుట్టూ తిరుగుతూ పాడుతున్నట్లే వున్నది. ఆమె తన ఎర్రని సన్నని పెదవులను కదిలిస్తూ తలను అటూ ఇటూ ఊపుతుంటే చెవికున్న లోలాకులు ఊగుతూ కొలనులో కలువలు ఊగుతున్నట్లే వున్నది. జుట్టును వదులుగా వదిలేయటంతో గాలి కెగురుతూ చిందరవందరగా ముఖం మీద పడుతుంటే బంగారుబొమ్మలాంటి ఆమె అద్భుతంగా మెరిసిపోతున్నది.

పాట ఆపుతూ, "ఈ ఉద్యోగానికి మీరే అప్లయి చేశారా లేక మా అన్నయ్య చేయించాడా?" అన్నది నన్ను స్వర్గంలోనుంచి కిందకు లాగుతూ.

"మూడు నెలల క్రితం మీ అన్నయ్య కలకత్తా వచ్చాడు గదా... అప్పుడు ఆ ఎడ్వర్టైజ్‌మెంట్ పేపరు కటింగు ఇక్కడనుంచి తెచ్చాడు!"

శ్యామూ పకపకా నవ్వింది. "ఎంత ముందు చూపున్న మనిషి!" అన్నది నిర్వేదంగా.

ఆమె అన్నదానికి నేను మాట్లాడలేదు.

"మీకు ఈ ఉద్యోగమొస్తే- నన్ను వివాహం చేసుకొని ఇక్కడే వుంటే- ఆయనగారు తల్లిదండ్రుల్ని చూడలేదనే అపప్రథ తప్పిపోతుంది... ముసలివాళ్ళు స్వంత ఊరుని, స్వంత ఇంటిని వదిలి రారంటున్నారని హైద్రాబాద్‌లో డప్పుకొట్టుకోవచ్చు. సరేనండి... నేను మిమ్మల్ని ఇష్టపడి వివాహం చేసుకున్నానే అనుకోండి... మీ తల్లిదండ్రులకు మీరొక్కరే కొడుకు... మీ నాన్నగారూ రెండు మూడేళ్ళలో రిటైరవ్వబోతున్నారని నాకు తెలుసు. వాళ్ళనేం చేద్దామనుకుంటున్నారు మీరు?"

నేను అప్రతిభుడనయ్యాను ఆమె మాటలకు.

"మీ మనస్సు నాకు పూర్తిగా అర్థమయింది... మీరు మీ వదినలా ప్రవర్తించరని నాకు తెలుసు!"

"ఓకే... నేను ప్రవర్తించను... కానీ నా బలహీనతలు నాకు ఉండవచ్చు... నేను తప్పు దారిన పోతే నా చెంపలు పగల గొట్టగల శక్తి మీ చేతులకున్నదా?"

నేను కళ్ళప్పగించి బొమ్మలా ఆమెనే చూస్తూ వుండిపోయాను. "నా హృదయం నా భార్యను కొట్టేటంత బలహీనమైనదా?" అన్నాను.

"అది సామాన్యుడి భావన! బలహీనం కాకుండా వుండాలనే నేను కోరుకునేది. తప్పు చేసిందెవరైనా శిక్షించగల శక్తి వుంటేనే మంచి మనిషి కాగలుగుతాడు. రేపు మీరు మీ పిల్లల్నెలా పెంచుతారు?"

"కొట్టా?" అన్నాను బాధగా.

"తప్పు చేసినా ముద్దు పెట్టుకునా?... ఇంకా ప్రోత్సహించా? నా భర్త అలాంటి బలహీనుడవ్వటం నాకిష్టం లేదు!" అన్నది శ్యామూ.

నేను కళ్ళు మూసుకున్నాను. శ్యామూ మాటలు అర్థమవుతున్నాయి. శ్యామూ అర్థమవుతున్నది. శ్యామూను వంచించటం నా అభిమతం కాదు.

ఇద్దరం నిశ్శబ్దంగా కూర్చున్నాం. కొద్ది నిముషాల విరామం తరువాత కంఠాన్ని ఆమెను అనుకరిస్తున్నట్లుగా మారుస్తూ, "ఒక్క మాట... రేపు ఉదయం ప్రోగ్రాం?" అన్నాను.

"ఉదయాన్నే కాళీఘాట్‌కు వెళ్ళి అతి శక్తివంతురాలయిన కాళీమాతను దర్శించుకు వద్దాం!"

"మీరు కోరుకునే శక్తిని నాకు ప్రసాదించమని నేనూ ప్రార్థిస్తాను!" అన్నాను దృఢంగా.

"తరువాత విక్టోరియా మెమోరియల్‌కు వెళ్దాం!"

"అక్కడకు సాయంత్రం వెళ్దాం... అది చూచింతరువాత నీ చేతిలో చేయి వేసుకొని లవ్వర్స్ పార్కులో తిరగాలనేది నా కోరిక!"

శ్యామూ లేచింది. నాతలమీద చేయి వేసి, జుట్టు రేపేస్తూ, "గుడ్‌బాయ్!" అన్నది.

ఆమె గది తలుపు తీసుకొని వెళ్ళబోతుంటే, "ఒక్కమాట!" అన్నాను వెనక్కు రమ్మనమన్నట్లుగా చేయి జాస్తూ.

"అరమాటగూడా ఇక మిగలలేదు!" ఆమె నవ్వుతూ బైటకు వెళ్ళి తలుపు మూసేసింది.

*(స్వాతి: మాసపత్రిక: నవంబరు, 2003)*